

# అమెరికా అమ్మాయి

## - శ్రీనిధి యెల్లల



**ఉద్యోగాలకోసం కొందరు**, చదువుల కోసం కొందరు, ఇలా వారి వారి కలల వెంటపడి చేరుకునే గమ్యం ఒకటి ఉంది ....అదే అమెరికా!

చిన్నతనంలో ఎంతో అబ్బురంగా, స్వర్గానికి మరోపేరుగా తలచిన దేశం. అక్కడి విశేషాలు, వస్తువులు, అక్కడినుంచి వచ్చిన మనుషులూ, అందరూ ఎంతో గొప్పవారనీ దేశంలో ఎంతటి పేరున్న గుడి వారైనా పూర్ణ కుంభంతో స్వాగతం పలికేటంత వి.వి .ఐ పీలు అనీ అనుకునే రోజుల నుండీ ... "ఆ వదినా మా పిల్లకి ఆవకాయ్ పట్టడానికి సాయానికి అమెరికా వెళ్తున్నాను దార్లో మీ అబ్బాయికి ఏమైనా ఇవ్వాలంటే ఇవ్వు, ఇచ్చేసి వస్తాను" అనే రోజుల్లోకి వచ్చేసాము .

దూరం కొద్దీ విలువని అంచనా వేసే మనం, ఆ దూరం తగ్గిపోయేసరికీ విలువనీ తగ్గించేస్తున్నామేమో?

ప్రపంచంలో అందరూ రెండే రెండు రకాల వారి గురించి చర్చిస్తూ ఉంటారు. ఒకళ్ళు ఉత్తములు అయితే మరొకళ్ళు అధములు. వీళ్ళు కాకుండా మరొక రకం ఉంది అదే మధ్యముల్ అన్నమాట. పై చెప్పిన రెండు రకాల వారి గురించి చర్చిస్తూ ఉంటారు . వీళ్ళ గురించి ఎవరూ పెద్దగా పట్టించుకోరు. కానీ వారు మాత్రం అందరి సమస్యలు నెత్తిన వేస్కుని భూభారాన్ని మోసేస్తూ ఉంటారు. ఆ కేటగిరీలో ఫస్టు ఉండేవాళ్ళలో నేనొకదాన్ని. ఉద్యోగం వదిలేసి భర్త వెంట అమెరికా వాసం వచ్చిన కాండిడేట్ ని. వీసా సమస్యల వల్ల ఇంట్లో చిక్కుకుపోయి , రోజూ న్యూస్ లో వచ్చే అమెరికా వార్తలు విని నాకెప్పుడూ ఉద్యోగం వస్తుందో అని లెక్కలు వేసే చుట్టాలని మేనేజ్ చేస్తూ, ఒంటి చేత్తో ఇంటినీ, పిల్లల్ని మేనేజ్ చేస్తూ, ఉద్యోగాలకి వెళ్లే ఆడవారి వైపు ఆరాధనగా, హడావిడిగా కాలేజులకీ పార్టీలకి వెళ్లే పిల్లల వైపు ఈర్ష్యగా, ఇప్పుడే కొత్తగా వచ్చిన వారిని తేలిగ్గా చూస్తూ, గడుసుగా ఈ అమెరికా వాసాన్ని ఈదుతూన్న ఒక సగటు తెలుగు పిల్లని.

మబ్బుల చాటు తొలగిపోతున్న కొద్దీ, కాస్తకాస్తగా బయటపడుతున్న అందమైన దేశాన్ని విమానపు కిటికీలోంచి ఆనందాతిశయంతో చూసిన మొదటి క్షణాలు ఎన్నటికీ మరచిపోలేను. చదివిన చదువూ, చేసిన ఉద్యోగం దేనివల్లనైతేనేం సిగ్గు, బిడియాలు అనే ఆభరణాలు పాతవైపోయి పర్యుత్సుకత, ఉత్సాహం అనే అలంకారాలు మాత్రమే ధరించిన ఈకాలపు అమ్మాయిని. ఎయిర్ పోర్ట్ నుండి బయట పడి అమెరికా గడ్డపై నిలబడ్డప్పుడు మొట్ట మొదటగా గమనించిన మార్పు, మనుషుల కరువు. ఒక్క నిమిషం ఉక్కిరిబిక్కిరి చేసిన ఒంటరితనం. చిన్న కలవరపాటు. రివ్వున వీస్తున్న చల్లటి గాలికి కళ్ళలో ఊరిన తడికి అస్పష్టంగా అల్లుకుని పోయినట్టు ఉన్న బంగారు అక్షరాలు . తేరుకుని చూద్దును కదా, అరచేతిలో ఉన్న పాస్ పోర్టుపై "సత్యమేవ జయతే" అన్న అక్షరాలు. నువ్వు నా బిడ్డవి, నీకు ఎదురే లేదు అని ఎదో శక్తి భుజంతట్టిన భావన. అలా పడింది అమెరికా నేలపైన నా మొదటి అడుగు. ఇక్కడి ప్రస్తుత జీవనం, ఇన్ని సుఖాల మధ్య ఉండే కష్టాలు, ఉక్కిరిబిక్కిరి చేసేంత పని లేదా పిచేక్కించేంత ఏకాంతం, చదువుకునేందుకు పాట్లు, ఉద్యోగపు వేటలు, తల్లితండ్రుల ఆశలు పిల్లల ఆశయాలు ఇలా ఎన్నో విశేషాలు. ఈ భావోద్వేగపు రంగులరాట్నంలో నాతో పాటు షికారుకు తయారు అవ్వండి మరి..

★★★

## భలే మంచి చౌక (?) బేరము !

ఈవారం గ్రోసరీ షాపింగ్ నా వంతు. మా 'బే ఏరియాలో' పచారీ సామాను కొంటానికి వెళ్తున్నాను, మీరు కూడా వస్తారా? రండి మరీ, సీట్ బెల్టు సర్దుకుని కూర్చోండి, అలా వెళ్ళొద్దాం. ముందైతే దుకాణం వచ్చే వరకు కాస్త చరిత్ర చెప్పుకుందాం. 'డిమాండ్ అండ్ సప్లై' ఆధారంగా ఇప్పుడు ఊరికో పచారీ కొట్టు ఉంది కానీ, తొలి నాళ్ళలో అమెరికా వచ్చిన వారు పడాల్సిన కష్టాలన్నీ పడ్డారు పాపం. ముఖ్యమైన పట్టణాల్లో మాత్రమే ఉండే ఒకటో అరో ఇండియన్ షాపులకి ఉత్తరాలు రాసి ముందుగా ఆర్డర్ పెట్టుకుంటే కానీ పప్పులు, ఉప్పులూ కళ్ళ జ్యూసే భాగ్యం ఉండేది కాదుట. ఇప్పుడైతే మరి కుంకుడు కాయల నుండి వేప పువ్వు వరకూ దొరకని వస్తువు లేదంటే చూసుకోండి.

అదుగో ఇండియన్ స్టోరు వచ్చేసింది దిగండి దిగండి. ట్రాలీ తీస్కున్నామా, ఇక నడవండి. మనం వెళ్ళబోయేది మన అడ్డా. ఎటు చూసినా అంతా మనవాళ్లే. కాబట్టి కొత్త దేశంలో నేర్చుకున్న పద్ధతులూ, పాలిష్ పట్టి మెరిపించుకున్న మానర్సు, వ్యవహారాలూ అన్నీ తుంగలో తొక్కేయండి. కిటికీలోంచి జేబురుమాలు వేసి సీట్ ఆపుకుంటామే ఆ ఒరిజినాలిటీని బయటికి తీసుకురావాలి. మరి తప్పదు. లేకపోతే నెగ్గుకురాలేము ఈ చోట. చూస్తారుగా!

ముందుగా కూరగాయల దగ్గరికి వెళదాం. జనం ...జనం! వీకెండ్ లో గ్రోసరీ షాపింగ్ అంటే సాహసమే సుమా! ట్రాలీని ఆయుధంలా చేసుకుని అటు వారికీ ఇటు వారికీ గోడలా పెట్టి, మోచేతులని అడ్డేసి, వెనకవారికి ముందు ఏమున్నాయో కనిపించకుండా నిల్చుని చాకచక్యంగా కవర్లో వేసేసుకుంటున్నారు కాస్త అనుభవం ఉన్నవాళ్లు. అంత దూకుడులేని వాళ్ళు కాలు కాలిన పిల్లుల్లా ఎక్కడ సందు దొరుకుతుందా అని వీరి వెనుకాలే విసుగ్గా ఎదురుచూస్తూ హడావిడి పడ్తున్నారు. ఓపిక నశించినవారు మోచేతుల యుద్ధంతో దూరిపోయి కావాల్సింది తీసేసుకుని విజయ గర్వంతో వేరే సెక్షన్లకు పరుగులు పెడుతున్నారు.

రకరకాల మనుషులు. “డాలర్ పెట్టి గుప్పెడు కరివేపాకు కొనడమా? లేక పదమూడు డాలర్లు పెట్టి కరివేపాకు మొక్కకొని దాన్ని చెట్టంత చేసి అమెరికా మొత్తం కరివేపాకు పంపిణీ చేయడమా?” అని తీరుబడిగా ఆలోచనలు చేసేవారు ఒకవైపు. త్వర త్వరగా పనిముగించుకుని వీకెండ్ సమయాన్ని ఆదా చెయ్యాలనుకుని హడావుడి పడే వారు ఒకవైపు. పానీపూరి కార్నెర్ దగ్గర నిలబడి స్టార్ట్ అప్ కంపెనీలు, కొత్త ఐడియాలు పంచుకునే వారు ఒకవైపు, ఎటు చూసినా సందడి సందడిగా ఉంటుంది.

"అమ్మ! నీకు ఫోటోలు వాట్సాప్ చేశాను చూడు. ఏమేమి తీసుకోవాలో మెసేజ్ చెయ్యవా.?" కొత్తగా సంసారం మొదలుపెట్టిన కొత్త పెళ్లికూతురు అమ్మతో ఆన్ కాల్ సరుకుల షాపింగ్ చేస్తోంది.

"ఎక్కడా ఒక చచ్చు, పుచ్చు లేదు. ఎంత నాణ్యమైన సరుకో! పిలకలేని బోడిగుండు కొబ్బరికాయలతో పూజా? సరేలే సముద్రాలు దాటేసి వచ్చాక పట్టింపులతో పనేముందిలే, నలుగురితో నారాయణ! " గొణుక్కుంటున్న పర్యాటక తల్లితండ్రులు.

"హలో, హలో మిమ్మల్నే. నా ట్రాలీ తీస్కెళ్ళిపోతున్నారు. మీది ఇది!" ఈ గందరగోళంలోంచి త్వరగా బయటపడాలనే తాపత్రయంలో వేరే ట్రాలీని తీసుకుని వెళ్లిపోతున్న వారు కొందరు.

"కాస్టుకో వాడు కంది పప్పు, మినప్పప్పు, గోధుమ పిండి అమ్ముతున్నాట్ట. ఇదే ధరకు రెండింతల సరుకు మరి. చెరో బస్తా కొనుక్కుని పంచేసుకుందామేంటి?" ఒక కాస్టుకో హోల్ సేల్ వీరాభిమాని ప్రతిపాదన.

"ఆర్గానిక్ పసుపు లేదా అండి మీ షాప్ లో? ఇలాగైతే మీ సర్వీస్ గురించి మంచి రివ్యూస్ ఎలా వస్తాయి చెప్పండి? " అంటూ షాపు వాళ్లతో వాదిస్తున్నతన్ని చెత్త రివ్యూలు రాస్తారేమో అనే భయంతో ‘కర్ర విరవక పాముని చంపక' అన్న చందంగా మెత్త మెత్తగా సముదాయిస్తున్న షాపువారు.

"మన లోకల్ రేడియోలో మీ షాపువారు సమర్పిస్తున్న సినిమా క్విజ్ ప్రోగ్రాంలో కూపన్ గెల్చుకున్నా. ఇదుగో కూపన్. నా గిఫ్ట్ ఇస్తే నే వెళ్తా." హుషారుగా అడుగుతున్న రేడియో అభిమానితో “ఇదిగోండి మీరు గెలుచుకున్న 'దేశీగృహ' ఇడ్లి మరియు దోస పిండి. లోకల్ గా చేస్తామండీ, మీకు నచినట్లైతే యెల్ప్ లో రివ్యూ ఇచ్చి, మా ఫేస్ బుక్ పేజీని లైక్ చేసి, కామెంట్ చేసి షేర్ చెయ్యండి. థ్యాంక్ యూ!” అంటూ రికార్డు వేస్తున్న సేల్స్ అమ్మాయి.

పిల్లలని ట్రాలీలో కుదేసి వాళ్ళ అల్లరి భరిస్తూ, ఆ చికాకుతో తొడిమలన్నీ తీసుకున్నా తీసుకోకపోయినా తుంచేసి, చక్కగా సర్దిన కూరగాయల్ని కలగాపులగం చేసేసి, పైనున్న ఆకుకూరలన్నీ కెలికేసి, అడ్డమొచ్చిన వారిని ట్రాలీలతో గుద్దేసి అవస్థ పడుతున్న తల్లులు.

పిల్లల స్కూలింగ్ నుండి పెళ్లిళ్ల వరకూ, ఇంటి అద్దెల నుండి ఇండియాలో రియల్ ఎస్టేట్ వరకూ ఏదీ వదలకుండా ఒకరి గురించి ఒకరు తెలుసుకుంటున్న, ఇంతకాలం కలుసుకోడానికి తీరికలేని పాత మిత్రులు.

వ్రతాల కోసమో, భార్య సీమంతం కోసమో స్పెషల్ గా ఆర్డర్ చేసి తెప్పించిన మల్లెపూలని, తమలపాకులని జాగ్రత్తగా సర్దుకుంటూ అమ్మలూ, అత్తగార్లు ఇచ్చిన పట్టీలో సరుకులు అన్నీ ఉన్నాయో లేదో సరిచూసుకుంటూ కొత్త భాధ్యతలకి సిద్ధపడుతున్న అబ్బాయిలు.

ఇంకో చివర కాసింత చోట పెట్టుకున్న బ్యూటీ పార్లర్ లోకెళ్ళిన భార్యకోసం సామానంతా కొనేసి పిల్లని సముదాయిస్తూ ఎదురుచూస్తున్న భర్త. ఈ మధ్యన ఉభయ తెలుగు రాష్ట్రాలలో వచ్చిన సిరి ధాన్యాల విప్లవం గురించి కనిపించిన వారందరికీ ఉచిత లెక్చర్లిస్తున్న డాక్టర్ ఖాదర్ వలీ ఉపాసకుడు ఒకవైపు. దూర ప్రాంతాలనుండి వచ్చి ఇంటికి కావలసిన సరుకులు కొనుక్కుని, అక్కడే ఉన్న స్నాక్స్ జాయింట్ లో పకోడీలో, సమోసాలో, పునుగులో ఏవో ఒకటి తినేసి, ఇంటికి కొన్ని 'టూ–గో' కూరలు ప్యాక్ చేయించుకునే పక్క ఊరి వాళ్ళు.

ఇలా ఎటు చూసినా ప్రాంతీయ, జాతీయ వాతావరణంతో ఎప్పుడు చూసినా కోలాహలంగా ఉంటాయి మా ఇండియన్ స్టోర్లు.

ఆ ఆ... అప్పుడే అయిపోలేదండీ, నా కిష్టమైన సెక్షన్ కి తీస్కెళతాను రండి. అదుగో ఆ మూలన పూజా సామాన్లు, సోపులు, క్రీములు పెట్టారే అదే. అక్కడికి వెళ్ళగానే టైం మెషిన్ ఎక్కి చిన్నప్పటి మా ఊరుకి స్పెషల్ ట్రిప్ వెళ్ళొచ్చినట్టు ఉంటుంది. నాన్నని గుర్తుకుతెచ్చే మైసూర్ శాండల్ గుండ్లు, అత్తని గుర్తుతెచ్చే పౌడర్ చెండ్లు, అమ్మ పెట్టుకునే తిలకం సీసాలు ఉంటాయి. ఊహ తెలిసిన నాటి నుండి చూస్తున్న బ్రాండ్లు అన్ని "బాగున్నావా అమ్మణ్ణి! " అని పలకరించినట్లు ఉంటుంది. ఓల్డ్ సింథాల్ వాసనకి వేసవి సెలవులు, అమ్మమ్మ నవ్వులు గుర్తొస్తాయి. గంధపు బిళ్లలు, ఛాయ పసుపు, కుంకం పొట్లాలు చూస్తుంటే శ్రావణ శోభ నవ్వుతూ ఎదురొచ్చినట్టుగా ఉంటుంది. గుత్తులుగా పెట్టిన ఒత్తులు, ఉద్ధరిణి మొదలైన పూజ సామాను చూస్తుంటే పూజ చేసుకున్న తర్వాత హారతికి పిలిచి, చేతిలో పటిక బెల్లం పెట్టె నాయనమ్మ మతికి వస్తుంది. అగరబత్తి వాసనలకి శ్రద్ధగా చదివి, మంచి ర్యాంకుకోసం దేవుడిని వేడుకునే స్కూల్ రోజులు గుర్తొస్తాయి. వికో టర్మరిక్ నుండి జిందా తిలిస్మాత్ వరకు. డాబర్ వజ్రదంతి నుండి క్లోసప్ వరకు. ఫ్రెండ్స్ తో పంచుకునే మామిడి తాండ్ర నుండి టీ లో ముంచుకునే రస్కుల వరకు. నోరూరించే పాలకోవాల నుండి జిలేబీల వరకు, ఒక్కటనేమిటి ఇండియన్ స్టోర్ లో ప్రతీ వస్తువు అలా అనుభూతుల జ్ఞాపకాల వైపు లాగేస్తాయి.

ఇక్కడి నుండి మనసు మరల్చుకుని బయటి పడేసరికి చాంతాడంత క్యూ వెక్కిరిస్తూ ఉంటుంది. వైకుంఠపాళిలో ఆఖరి గడి ముందు ఉండే పెద్ద పాము మింగినట్టు షాపింగ్ అంతా అయ్యాక మళ్ళీ మొదటికి వచ్చి గుమ్మం దాకా ఉన్న క్యూలో వెళ్లి నుంచోవాలి, పదండి.

షాపంతా చీమల బారులా మెలికలు తిరుగుతూ అక్కడక్కడే ప్రదక్షిణలు చేస్తుండాలి ఇక. గుడుగుడు గుంజం ఆడుతున్నట్టు అలా మెలికలు తిరుగుతూ, ఇద్దరు ముగ్గురుకి ముందూ వెనకా జాగాలు కాపాడి, పిల్ల తండ్రికి కాస్త సాయం చేసి ఒక యుగ కాలం అయిందనగా వచ్చింది కౌంటర్. కరెక్టుగా ఆ చివరి లైనంతా నోరూరించే పిప్పెర్మెంట్లు, చిక్కీలు, టుటి ఫ్రూటీలు, ఉప్పూకారం పెట్టిన పచ్చిమామిడి చోక్లెట్లు, నారింజ మిఠాయిలు లాంటి చిన్ననాటి జిహ్వ చాపల్యానికి ప్రతీకలైన సామాగ్రితో నింపేసి ఉంటుంది. అవసరం ఉన్న లేకపోయినా, వాడినా వాడకపోయినా ఇంకొన్ని వస్తువులు ఆటోమాటిగ్గా ట్రాలీలోకి దూకుతాయి.

"నెక్స్ట్ " ఆహా.... అదిగో నాకు స్వేచ్ఛని ప్రసాదించి మోక్షాన్ని ఇచ్చే పిలుపు.

డిగ్నిటీ ఆఫ్ లేబర్ కి సాక్షాలుగా చికాకు, అసహనం తప్ప ఇంకో భావం కనపర్చని స్టూడెంట్ పిల్లలు ఉంటారక్కడ ఎక్కువగా. చక చక అన్ని సామాన్లు కుక్కేసి, మన వైపుకి తోసేసి పొమ్మనకుండా పొగ పెట్టడంలో సిద్ద హస్తులు.

హమ్మయ్య ఇక బయటపడొచ్చు అనుకునే లోపు, సరీగ్గా గుమ్మం దగ్గర పెట్టిన స్నాక్ జాయింటు. ఇంకో ద్వారంకూడా లేదు పారిపోడానికి. ఇంత కష్టపడ్డందుకు కడుపు ఆవురావురు మంటోంది కదూ. సిరి ధాన్యాలు కోపగించుకున్నా, కీటో డైట్ అలిగినా లెక్కచెయ్యకుండా మనసుతో సంబంధం లేకుండా లాక్కెళ్లిపోతున్నాయి కాళ్లు. హాయిగా ఒక ప్లేటు పానీపూరి ఒక ప్లేటు మిరపకాయ్ బజ్జి లాగించేసి బయటపడదాం. ఏమంటారు? రండి మరి.

*(వచ్చేనెలలో అమెరికా అమ్మాయి ఏం చెబుతుందో.. ఎదురుచూద్దాం..!!)*

Post your comments